జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,

డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో

కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com



గురువారం | 27-08-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 766 పేజీలు: 4 వెల : రూ.7






## శ్రీకాకుళం జాతీయ రహదారిపై..

# మరణ మృదంగం

- నగరంలోని బైపాస్ వద్ద నిర్మించని ఫ్లైఓవర్
- రోడ్డును దాటుతూ ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు
- ఇదే అంశంపై రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో చర్చ
- బాధ్యతారాహిత్యంలో ఎన్‌హెచ్‌ఏఐ
- ఉన్నతాధికారుల ఆదేశాలు సైతం బేఖాతర్
- తలలు పట్టుకుంటున్న పోలీసులు

శ్రీకాకుళం, ఆగస్టు 26 (వార్త): జిల్లా వ్యాప్తంగా జాతీయ, ప్రధాన రహదారులపై రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమై అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నా, జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) కంటితుడుపు చర్యలతో కాలయాపన చేస్తోంది. జిల్లాలో ఏటా వందలాది మంది ప్రమాదాల్లో మరణిస్తున్నారని ఆందోళనకర అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. నగరానికి అత్యంత కీలకమైన నవభారత్, బైపాస్ జంక్షన్ల వద్ద శాశ్వత ఫ్లైఓవర్ నిర్మాణం అత్యవసరమని మొరపెట్టుకుంటున్నా, సాంకేతిక నిబంధనలను సాకుగా చూపి అధికారులు చేతులెత్తేయడంపై సర్వత్రా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇటీవల జరిగిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీటీసీలు ప్రమాదాల తీవ్రతను ఎత్తిచూపినప్పటికీ, ఎన్‌హెచ్‌ఏఐ ప్రతినిధులు రూల్ బుక్ వంకతో దాటవేత ధోరణి ప్రదర్శించడం వివాదాస్పదంగా మారింది.

**గడిచిన మూడేళ్ల అధికారిక గణాంకాలు..**

జిల్లాలో రహదారుల భయానక పరిస్థితికి సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. 2024లో నమోదు కాబడిన 889 రోడ్డు ప్రమాదాల్లో 289 మంది ప్రాణాలు కోల్పోగా, 1,036 మంది తీవ్రంగా గాయపడ్డారు. అదే తీరు 2025లోనూ కొనసాగి, 712 ప్రమాదాల్లో 275 మంది దుర్మరణం పాలయ్యారు, 808 మంది క్షతగాత్రులయ్యారు. ఇక 2026 ఆగస్టు నాటికి కేవలం ఎనిమిది నెలల వ్యవధిలోనే 436 ప్రమాదాలు జరిగి, ఇప్పటికే 168 మంది బలికాగా, 487 మంది ఆస్పత్రుల పాలయ్యారు. నిత్యం రక్తం ఏరులై పారుతున్నా, ప్రమాదకరమైన బ్లాక్ స్పాట్లను గుర్తించి నివారించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారనడానికి ఈ ప్రాణనష్టమే ఉదాహరణ. విశాఖపట్నం వైపు నుండి పాలిటెక్నిక్ రోడ్డు మీదుగా హైవేపైకి వచ్చే వాహనదారులకు తీవ్రమైన వాలు, కుడివైపు మలుపు వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఘోర ప్రమాదాలు జరుగుతున్నాయి. మరోవైపు ఆరు లేన్ల రహదారికి అనుసంధానంగా ఉన్న సర్వీస్ రోడ్డు కేవలం రెండు లేన్లకే పరిమితం కావడంతో నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తోంది. అరసవల్లి, శ్రీకూర్మం క్షేత్రాలకు వెళ్లే భక్తులు, కలెక్టరేట్, జిల్లా పరిషత్ పనులపై వచ్చే ప్రజలతో పాటు పాలిటెక్నిక్, పాఠశాల విద్యార్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఆరు లేన్ల రహదారిని దాటాల్సి వస్తోంది. కలెక్టర్ స్వయంగా ఫ్లైఓవర్ ప్రతిపాదన తెచ్చినప్పటికీ, సమీపంలోనే ఇతర అండర్‌పాస్, ఫ్లైఓవర్‌లు ఉన్నాయని, ఐఆర్‌సి నిబంధనల ప్రకారం రెండు కిలోమీటర్ల పరిధిలో మరొకటి నిర్మించడం సాధ్యపడదని ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ నిరాకరించడం గమనార్హం. స్థానిక అవసరాలను పక్కనపెట్టి సాంకేతిక సాకులు చూపడంపై విమర్శలు వెల్లువెత్తడంతో, ఎన్‌హెచ్‌ఏఐ ప్రత్యామ్నాయ ప్రణాళికలకు మొగ్గు చూపింది. ఫ్లైఓవర్‌కు ప్రత్యామ్నాయంగా పాదచారుల అండర్‌పాస్ (పియుపి), ఓవర్ పాస్ (ఆర్‌ఓపి) నిర్మించడంతో పాటు సర్వీస్ రోడ్డును విస్తరించేందుకు అంగీకరించి, ఈ పనులను 90 రోజుల్లో పూర్తి చేస్తామని సమావేశంలో హామీ ఇచ్చింది. అయితే ఇవన్నీ కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో వేగంగా అమలు చేయాలని, నిత్యం మరణమృదంగం మోగిస్తున్న నవభారత్ జంక్షన్ వద్ద యుద్ధప్రాతిపదికన శాశ్వత రక్షణ చర్యలు చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని శ్రీకాకుళం నగరవాసులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

- పలాస-కాశీబుగ్గ జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు
- సోదరభావం, మానవతా విలువలు పాటిస్తూ పట్టణంలో శాంతి ర్యాలీ
- మత సామరస్యం, ఐక్యతను కాపాడాలి
- సత్యం, కరుణ, సేవా భావాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలి
- జామియా మసీదు కమిటీ సభ్యులు



పలాస, ఆగస్టు 26 (వార్త): మిలాద్ ఉన్ నబీ వేడుకలు కాశీబుగ్గ జామియా మసీదులో బుధవారం ఘనంగా నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదర, సోదరీమణులందరికీ హృదయపూర్వక మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు ఒకరు ఒకరు తెలుపుకున్నారు. కాశీబుగ్గ జామియా మసీదులో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం పలాస, కాశీబుగ్గ జంట పట్టణాల్లో పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొని శాంతి ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీ శాంతి, సోదరభావం, మానవతా విలువలను చాటుతూ కొనసాగింది. ప్రవక్త మహమ్మద్ బోధించిన సత్యం, నైతికత, కరుణ, సేవా భావాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని జామియా మసీదు కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ పరస్పర గౌరవం, సోదరభావంతో మెలగాలని వారు కోరారు. మత సామరస్యం, ఐక్యతను కాపాడేందుకు అందరూ కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు. ర్యాలీలో పాల్గొన్న ముస్లిం సోదరులు శాంతి, సోదరభావానికి సంబంధించిన నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. కాశీబుగ్గ మసీదు నుంచి మూడు జంక్షన్ మీదుగా, కాశీబుగ్గ బస్టాండ్, శ్రీనివాస లాడ్జి మీదిగా పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ముస్లిం సోదరులు ర్యాలీ నిర్వహించారు. ప్రవక్త మహమ్మద్ బోధించిన శాంతి, సౌభ్రాతృత్వం, ప్రేమ, కరుణ, మానవతా విలువలు సమాజానికి ఆదర్శనీయమని ముస్లింల మత పెద్ద తెలిపారు. ప్రవక్త చూపిన సన్మార్గంలో పయనిస్తూ పరస్పర గౌరవం, ఐక్యత, సోదరభావంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. మిలాద్ ఉన్ నబీ పర్వదినం ప్రతి కుటుంబంలో ఆనందాన్ని నింపాలని, ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం కలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఎస్‌కే భాషా, కార్యదర్శి ఎస్‌కే బషీర్, సభ్యులు మహమ్మద్ షమ్మీ, సయ్యద్ హుస్సేన్, మీర్ ఖాదర్, గౌస్, తమిమ్, షాబుద్దీన్, రాజేష్ ఖాన్, ఖాసిం, మున్నా, జిలాని, బబ్లూ, సయ్యద్ షాహిద్, ఫర్దోష్ ఖాన్, ఖాసిం (ఉదయపురం) తదితరులు పాల్గొన్నారు.











## వైద్య, ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



**మందస, ఆగస్టు 26(వార్త):** వైద్య, ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలని కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మందస మండలంలోని హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగా నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ మెంబర్ జి.సంతోష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ లో దాదాపుగా దశాబ్దాల కాలం నుండి కాంట్రాక్ట్ ఉద్యోగులు కాంట్రాక్టు ఉద్యోగులుగానే పనిచేస్తున్నారన్నారు. వారి అర్హతలను బట్టి అందర్నీ రెగ్యులర్ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని, అప్పటివరకు 100% గ్రాస్ వేతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులరైజ్ చేసేటంతవరకు తమ న్యాయం డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ లక్ష్మి, రోజా, గీత, ల్యాబ్ టెక్నీషియన్ మల్లేష్, ధనలక్ష్మి, ఫార్మసిస్ట్ జీవిత తదితరులు పాల్గొన్నారు.

## గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

**ఇచ్ఛాపురం, ఆగస్టు 26 (వార్త):** బి.తోటూరు వద్ద బహుదా నదిలో పడి గల్లంతయిన సైదాల పుట్టుగ కి చెందిన నారద గంగయ్య (60).నదిలో శవమై తేలాడు. నది ఒడ్డున మృతదేహం లభించినట్లు రూరల్ ఎస్ఐ జనార్ధనరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులుకి అప్పగించామన్నారు.

### పలాస మున్సిపల్ పోరు..

# చైర్మన్ పీఠంపై సమీకరణం

**- బరిలో నిలిచేందుకు దువ్వాడ శ్రీకాంత్ సిద్ధం?**

**-ప్రత్యక్ష ఎన్నికలతో పెరిగిన పోటీ**

**-టికెట్లపై ఆశావాహుల్లో ఉత్కంఠ**

**-సామాజిక సమీకరణాలే కీలకమా?**

**-స్వతంత్రంగా బరిలోకి దిగే యోచనపై చర్చ**

**పలాస, ఆగస్టు 26 (వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈసారి చైర్మన్‌ను ప్రజలు నేరుగా ఎన్నుకునే విధానం అమల్లోకి రావడంతో ప్రధాన రాజకీయ పార్టీల్లో ఆశావాహుల సంఖ్య పెరుగుతోంది. ముఖ్యంగా అధికార తెలుగుదేశం పార్టీలో చైర్మన్ అభ్యర్థిత్వంపై అంతర్గత చర్చలు ఊపందుకున్నాయని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇప్పటికే పలువురు నాయకులు తమ అనుచర వర్గాలతో కసరత్తు ప్రారంభించగా.. సీనియర్ నాయకుడు, పలుమార్లు కౌన్సిలర్‌గా ఎన్నికైన దువ్వాడ శ్రీకాంత్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ప్రజల్లో పరిచయం.. కార్మిక వర్గాల్లో పట్టుతో దువ్వాడ శ్రీకాంత్‌కు పట్టణ రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉందనే అభిప్రాయం ఉంది. మున్సిపాలిటీ పరిధిలోని పలు కార్మిక సంఘాలు, ఆటో రిక్షా కార్మికులు, తోపుడు బండ్ల కార్మిక సంఘాలతో ఆయనకు ఉన్న అనుబంధం రాజకీయంగా బలంగా మారుతుందని అనుచరులు చెబుతున్నారు. సుమారు 19 కార్మిక సంఘాలకు గౌరవ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న ఆయనకు వివిధ వర్గాలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెప్పొచ్చు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పలాస నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి విజయానికి ఆయన క్రియాశీలకంగా పనిచేశారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో వైకాపా హయాంలో చైర్మన్ పదవి ఆశించినా అవకాశం దక్కకపోవడంతో రాజకీయంగా అసంతృప్తికి గురైన ఆయన.. అనంతరం టీడీపీలో చేరారు. అప్పటి నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తున్నారని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు.

### టికెట్ ఎవరికి?

చైర్మన్ పదవికి ప్రత్యక్ష ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ టికెట్‌దే కీలకంగా మారింది. అభ్యర్థి ఎంపికలో సామాజిక, రాజకీయ, వ్యక్తిగత ప్రభావం వంటి అంశాలను పార్టీ అధిష్ఠానం పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉందనే చర్చ రాజకీయ పండితులు అంటున్నారు. కాళింగ సామాజిక వర్గానికి కాకుండా యాదవ లేదా వైశ్య సామాజిక వర్గాలకు ప్రాధాన్యం ఇవ్వవచ్చనే ప్రచారం టీడీపీ వర్గాల్లో సాగుతోంది.

అయితే ఇవన్నీ ప్రస్తుతం పార్టీలో జరుగుతున్న చర్చలు, రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న అంచనాలేనని.. తుది నిర్ణయం పార్టీ అధిష్ఠానానిదేనని రాజకీయ ఉద్దండులు అంటున్నారు. దీంతో ఆశావాహుల్లో ఉత్కంఠ నెలకొంది.

### శ్రీకాంత్ ముందడుగు వేస్తారా?

పార్టీ నుంచి స్పష్టమైన హామీ లభిస్తే దువ్వాడ శ్రీకాంత్ పోటీకి సిద్ధమవుతారనే ప్రచారం జరుగుతోంది. టికెట్ లభిస్తే కార్మిక సంఘాల మద్దతు, గతంలో కౌన్సిలర్‌గా ఉన్న పరిచయాలు, వివిధ సామాజిక వర్గాలతో ఉన్న సంబంధాలు తనకు కలిసొస్తాయని ఆయన వర్గం భావిస్తోంది.

సామాజిక సమీకరణాల కారణంగా టికెట్ దక్కకపోతే ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకునే అవకాశంపైనా ఆయన అనుచరుల్లో చర్చ కొనసాగుతుందని తెలుస్తుంది. స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగే అంశంపై కూడా అనుచరులు సమాలోచనలు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. దీనిపై శ్రీకాంత్ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉందని రాజకీయ పండితులు అంటున్నారు.

### రెబల్స్ భయం

ప్రత్యక్ష ఎన్నికల విధానం అమల్లోకి రావడంతో పార్టీ టికెట్ ఆశించి భంగపడే నాయకులు స్వతంత్రంగా పోటీ



చేసే అవకాశాలు పెరుగుతున్నాయి. అధికార టీడీపీతో పాటు వైకాపాలోనూ టికెట్ దక్కని ఆశావాహులు రెబల్ అభ్యర్థులుగా బరిలోకి దిగితే.. ప్రధాన పార్టీల అధికారిక అభ్యర్థుల విజయావకాశాలపై ప్రభావం పడే అవకాశం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

చైర్మన్ ఎన్నికలో ఒక్కో అభ్యర్థికి వ్యక్తిగత పరిచయాలు, సామాజిక అనుబంధాలు, స్థానికంగా ఉన్న ప్రజాబలం కీలకంగా మారనున్నాయి. దీంతో పార్టీ గుర్తు కంటే అభ్యర్థి వ్యక్తిగత బలం కూడా ఫలితాలను ప్రభావితం చేసే పరిస్థితి ఏర్పడిందని, ఇప్పటికీ దువ్వాడ శ్రీకాంత్‌కు టికెట్ లభిస్తే సునాయాసంగా చైర్మన్ పీఠం అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పాత సమీకరణాలకు భిన్నంగా..ఇప్పటి వరకు మున్సిపల్ చైర్మన్ పదవి విషయంలో కౌన్సిలర్ల మద్దతు, పార్టీ అంతర్గత బలాబలాలు ప్రధానంగా ఉండేవి. ప్రత్యక్ష ఎన్నికలతో పరిస్థితి పూర్తిగా మారనుంది. చైర్మన్ అభ్యర్థి నేరుగా ప్రజల తీర్పును కోరాల్సి రావడంతో పట్టణంలోని ప్రతి వార్డులోనూ బలమైన ప్రజా సంబంధాలు కలిగిన నాయకుల అవసరం ఏర్పడింది. ఇందుకు సరిపడే వ్యక్తి ఒకే ఒక్కడిని అదే శ్రీకాంత్ అని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు. ఇదే సమయంలో కౌన్సిలర్ అభ్యర్థుల ఎంపిక కూడా చైర్మన్ ఎన్నికపై ప్రభావం చూపనుంది. చైర్మన్ అభ్యర్థి వర్గానికి అనుకూలంగా వార్డు స్థాయి అభ్యర్థులను నిలబెట్టడం.. ఎన్నికల ప్రచారాన్ని సమన్వయం చేయడం ప్రధాన పార్టీలకు సవాలుగా మారనుంది.

### 2029పై ప్రభావం ఉంటుందా?

పలాస-కాశీబుగ్గ మున్సిపల్ ఎన్నికలు కేవలం స్థానిక రాజకీయాలకే పరిమితం కాకుండా.. నియోజకవర్గ రాజకీయాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందనే రాజకీయ విశ్లేషకులు విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ప్రత్యక్ష ఎన్నికల్లో గెలిచిన నాయకుడికి పట్టణ స్థాయిలో ప్రత్యేక రాజకీయ ప్రాధాన్యం లభించే అవకాశం ఉంది. అదే సమయంలో ఎన్నికల సమయంలో ఏర్పడే పొత్తులు, విభేదాలు, రెబల్ పోటీలు భవిష్యత్తు రాజకీయ సమీకరణాలకు బీజం వేసే అవకాశముంది.

ప్రత్యేకించి 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందు మున్సిపల్ ఎన్నికలు జరగడం వల్ల.. ఈ ఎన్నికల్లో ఏర్పడే రాజకీయ బలాబలాలు భవిష్యత్తులోనూ కొనసాగుతాయా అన్నది ఆసక్తికరంగా మారింది.

### తేలేది అధిష్ఠానం నిర్ణయంతోనే..

ప్రస్తుతం పలాస మున్సిపల్ చైర్మన్ పీఠం చుట్టూ అనేక పేర్లు వినిపిస్తున్నా.. ప్రధాన పార్టీల నుంచి అధికారికంగా అభ్యర్థుల ప్రకటన వెలువడాల్సి ఉంది. దువ్వాడ శ్రీకాంత్‌కు టికెట్ దక్కుతుందా? సామాజిక సమీకరణాల నేపథ్యంలో కొత్త ముఖాన్ని తెరపైకి తీసుకువస్తారా? టికెట్ దక్కకపోతే ఆయన స్వతంత్రంగా పోటీ చేస్తారా? అన్న అంశాలు ఉత్కంఠ రేపుతున్నాయి.

చైర్మన్ పదవికి ప్రత్యక్ష ఎన్నికలు జరగనుండటంతో పలాస మున్సిపల్ పోరు ఈసారి గత ఎన్నికల కంటే భిన్నంగా ఉండనుందని రాజకీయ పండితులు వ్యాఖ్యానిస్తున్నారు. పార్టీ బలం, సామాజిక సమీకరణాలు, వ్యక్తిగత పరిచయాలు, ప్రజాబలం.. ఈ నాలుగు అంశాల మధ్య జరిగే పోటీలో ఎవరు పైచేయి సాధిస్తారన్నది ఎన్నికల ఫలితాల వరకు ఆసక్తికరంగానే ఉండవచ్చని చెప్పవచ్చు.

## విద్యార్థులు సాంకేతికతను అలవర్చుకోవాలి

**- వృత్తి విద్యా కోర్సులపై అవగాహన కలిగి ఉండాలి**

**- హరిపురం భారతి ఐటీఐలో ప్రత్యేక శిక్షణ**

**మందస, ఆగస్టు 26(వార్త):** విద్యార్థులు చదువుతున్నప్పుడే సాంకేతికను అలవాటు చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు బి.గోపిచంద్ అన్నారు. మందస మండలంలోని హరిపురంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హరిపురంలో భారతి ఐటీఐలో విద్యార్థులకు ప్రత్యేకమైన విద్యా యాత్రలో భాగంగా ఇండస్ట్రియల్ విజిట్‌ను నిర్వహించారు. మందస మండలంలో జెడ్పీహెచ్ఎస్ ప్లస్ హరిపురం పాఠశాలకు చెందిన 9 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న సుమారు 83 మంది విద్యార్థులు, తమ ఉపాధ్యాయులతో కలిసి ఈ పర్యటనలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వృత్తి విద్యపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఒకేషనల్ కోర్సు ప్రాధాన్యత వివరించారు.




### విద్యార్థుల భవిష్యత్తుకు దిక్సూచి

పర్యటన ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థులలో వృత్తి విద్యలపై ఆసక్తిని పెంచడం, అవగాహన కల్పించడం. నేటి పోటీ ప్రపంచంలో కేవలం పుస్తక పరిజ్ఞానం మాత్రమే సరిపోదని, సాంకేతిక నైపుణ్యాలు కూడా అత్యంత కీలకమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపిచంద్ తెలిపారు. పాఠశాలలో ఐటీ, ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్ వంటి వృత్తి విద్యా కోర్సులను అందిస్తున్నారు. ఈ విజిట్ ద్వారా విద్యార్థులు ఆయా రంగాలలో క్షేత్రస్థాయి పనితీరును ప్రత్యక్షంగా చూసి నేర్చుకోవడానికి ఒక గొప్ప అవకాశం లభించిందని అన్నారు. విద్యార్థులు హరిపురం భారతి ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ను సందర్శించారు. అక్కడ ఐటిఐ ప్రిన్సిపల్, ఇతర నిపుణులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ల్యాబ్, కంప్యూటర్ హార్డ్‌వేర్, నెట్‌వర్కింగ్, సాఫ్ట్ వేర్ టెక్నాలజీస్ పనితీరును విద్యార్థులు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఎలక్ట్రానిక్స్ ల్యాబ్ లో విద్యార్థులు ఎలక్ట్రానిక్ పరికరాల పనితీరును, విద్యుత్ సర్క్యూట్ల తయారీని దగ్గరుండి చూశారు. ఆటోమోటివ్ వర్క్‌షాప్ లో ఇంజిన్ పనితీరు, వాహనాల నిర్వహణ, మరమ్మత్తు పనులను పరిశీలించి, ఆసక్తిగా ప్రశ్నలు అడిగారు.

### విద్యార్థుల స్పందన

పర్యటనలో పాల్గొన్న విద్యార్థులు ఎంతో ఉత్సాహాన్ని కనబరిచారు. విజిట్‌లో పుస్తకాలలో చదువుకున్న విషయాలను ప్రత్యక్షంగా చూడటం చాలా కొత్తగా ఉంది. ఐటి, ఇతర కోర్సుల గురించి క్షుణ్ణంగా తెలుసుకునేందుకు ఇది ఎంతగానో సహాయపడిందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్స్ తామాడ శ్రావణ్ కుమార్, పి.సురేష్, సీహెచ్ దినేష్, ఐటీఐ స్టాఫ్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన రహదారిపై పేలిన టైరు

**- శ్రీకాకుళం నుంచి పలాస వెళ్తున్న బస్సుకు ఘటన**

**- బస్సులో మరమ్మతులకు అవసరమైన పరికరాలు లేక ప్రయాణికులకు నిరీక్షణ**

**- ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం**

**-వాహనదారులకు ఇబ్బందులు**




**నరసన్నపేట, ఆగస్టు 26 (వార్త):** నరసన్నపేట ప్రధాన రహదారిపై శ్రీకాకుళం నుంచి పలాస వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందు టైరు అకస్మాత్తుగా పేలడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న బస్సు నరసన్నపేట ప్రధాన రహదారిపైకి చేరుకున్న సమయంలో ముందు టైరు పేలింది. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును వెంటనే నిలిపివేయడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. అయితే బస్సు రహదారిపైనే నిలిచిపోవడంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బస్సులో టైరు మార్చిడి, మరమ్మతులకు అవసరమైన సరైన పరికరాలు అందుబాటులో లేకపోవడంతో వెంటనే మరమ్మతులు చేపట్టలేకపోయినట్లు తెలిసింది. దీంతో ప్రయాణికులు కొంతసేపు ఇబ్బందులు పడ్డారు. పలువురు ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు ప్రత్యామ్నాయ వాహనాల కోసం వేచి చూడాల్సి వచ్చింది. ప్రధాన రహదారిపై బస్సు నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ఇరువైపులా వాహనాలు నెమ్మదిగా కదలడంతో ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పరిస్థితిని సరిచేసేందుకు తక్షణ చర్యలు చేపడుతున్నామని బస్సు డ్రైవర్ తెలిపారు. మరమ్మతులు పూర్తయిన అనంతరం బస్సును అక్కడి నుంచి తరలించనున్నట్లు పేర్కొన్నారు.

## మహిళా మార్ట్‌కు పూర్వవైభవమెప్పుడో?

**- ఒకప్పుడు స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆదాయ వేదికగా నిలిచిన మార్ట్**

**- ప్రస్తుతం లావాదేవీలు నిలిచిపోవడంతో దీనావస్థకు చేరిన కేంద్రం**

**- పునరుద్ధరించి పూర్వపు వైభవం తీసుకురావాలని స్థానికుల డిమాండ్**

**నరసన్నపేట, ఆగస్టు 26 (వార్త):** స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా నరసన్నపేటలో ప్రారంభించిన వెలుగు మహిళా మార్ట్ ప్రస్తుతం దీనావస్థకు చేరుకుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో 2025లో ఘనంగా ప్రారంభమైన ఈ మహిళా మార్ట్, స్వయం శక్తి సంఘాల మహిళా సభ్యుల సహకారంతో కొంతకాలం విజయవంతంగా కార్యకలాపాలు నిర్వహించిందని వారు గుర్తు చేస్తున్నారు. మహిళా సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులు, వివిధ వస్తువుల విక్రయాలకు ఈ మార్ట్ వేదికగా నిలిచింది. స్వయం ఉపాధి అవకాశాలను ప్రోత్సహించడంతో పాటు మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుందనే ఉద్దేశంతో దీనిని ఏర్పాటు చేశారు. ప్రారంభ దశలో మహిళల భాగస్వామ్యంతో మార్ట్ అభివృద్ధి దిశగా సాగిందని స్థానికులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం మార్ట్‌లో గతంలో మాదిరిగా లావాదేవీలు జరగడం లేదని, కార్యకలాపాలు మందగించడంతో ఏర్పాటు చేసిన లక్ష్యం నెరవేరడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మార్ట్ నిర్వహణ, అభివృద్ధిపై తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మహిళా మార్ట్ ప్రస్తుత పరిస్థితిపై సమీక్ష నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలను తిరిగి భాగస్వామ్యం చేసి, అవసరమైన సదుపాయాలు కల్పించడం ద్వారా మార్ట్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మహిళలకు ఉపాధి, ఆదాయ అవకాశాలు కల్పించేలా వెలుగు మహిళా మార్ట్‌కు పూర్వపు వైభవం తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.




### ఉద్దానం కోసం పోరాడే బిడ్డలను

## కన్న తండ్రికి కన్నీటి వీడ్కోలు

**- గురుదాసుపురంలో ఢిల్లేశ్వర్ ఆచారి రావుకు ఘన నివాళి**

**పలాస, ఆగస్టు 26 (వార్త):** ఉద్దానం ప్రాంతంలో మూత్రపిండాల వ్యాధి బాధితుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న ఉద్దానం అభివృద్ధి వేదిక కుటుంబంలో విషాదం నెలకొంది. వేదిక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటున్న బురగాపు దేవరాజు, బురగాపు సూర్యం తండ్రి ఢిల్లేశ్వర్ ఆచారి రావు ఇటీవల మృతి చెందారు. ఆయన స్వగ్రామమైన పలాస మండలం గురుదాసుపురంలో నిర్వహించిన పెద్దకర్మ కార్యక్రమానికి ఉద్దానం అభివృద్ధి వేదిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై నివాళులర్పించారు. వేదిక అధ్యక్షుడు సొర్ర రామారావు ఆధ్వర్యంలో నాయకులు ఢిల్లేశ్వర్ ఆచారి రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. అంతకుముందు నిర్వహించిన అంత్యక్రియల్లోనూ వేదిక సభ్యులు పాల్గొని కుటుంబానికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా సొర్ర రామారావు మాట్లాడుతూ ఉద్దానం బాధితుల కోసం పోరాడుతున్న ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులేనన్నారు. దేవరాజు, సూర్యం వంటి బిడ్డలను సమాజానికి అందించిన ఢిల్లేశ్వర్ ఆచారి రావు సేవలను గుర్తుచేసుకున్నారు. ఆయన మరణం కుటుంబ సభ్యులకే కాకుండా ఉద్దానం ఉద్యమానికి కూడా తీరని లోటన్నారు. ఆయన చూపిన విలువలతోనే కుమారులు ఉద్దానం ప్రజల సమస్యల కోసం పోరాడుతున్నారని తెలిపారు. ఈ కష్టకాలంలో వారి కుటుంబానికి వేదిక ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. గ్రామంలో అందరితో కలివిడిగా ఉంటూ మంచి మనసున్న వ్యక్తిగా పేరు తెచ్చుకున్న ఢిల్లేశ్వర్ ఆచారి రావు మృతి గ్రామానికి తీరని లోటని గ్రామస్తులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వేదిక గౌరవ అధ్యక్షుడు బత్తిని లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి దున్న గాంధీ, నాయకులు పిచ్చుక కిరణ్, అడతాల కుమార్‌స్వామి, బొడ్డు దాసు, లక్కోజి మిథున్, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# బంగారం కోసం చంపేశారు!

* వృద్ధురాలి హత్య కేసును ఛేదించిన పోలీసులు
* ఐదుగురు నిందితుల అరెస్ట్ * రూ.38 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం * జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి





**శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 26 (వార్త):** జలుమూరు మండలం అల్లాడపేట గ్రామానికి చెందిన చింతు చిన్నమ్మడు హత్య కేసును శ్రీకాకుళం జిల్లా పోలీసులు అనతి కాలంలోనే ఛేదించారని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను జిల్లా ఎస్పీ వివరించారు. ఈ కేసులో ఐదుగురు నిందితులు బెండి అచ్చుతరావు, కింతలి ధనలక్ష్మి, కింతలి గణేష్, బెండి లక్ష్మీనారాయణ, కింతలి మణికంఠలను అరెస్టు చేశామన్నారు. మృతురాలి వద్ద నుంచి అపహరించిన సుమారు రూ.38 లక్షల విలువైన 24 తులాలు బంగారు, 6 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మృతురాలు హైదరాబాద్‌లో నివసిస్తూ అప్పుడప్పుడు తన స్వగ్రామమైన అల్లాడపేటకు వచ్చి వెళ్తుండేదన్నారు. ఈ క్రమంలో ఈనెల 11న గ్రామానికి వచ్చిన ఆమె 17న గ్రామంలో జరిగిన కార్యక్రమానికి బంగారు ఆభరణాలు ధరించి హాజరయ్యారన్నారు. అనంతరం ఆర్టీసీ బస్సులో నరసన్నపేటకు చేరుకుందని, అక్కడ సుమారు ఉదయం 11.30 గంటలకు కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం నిమిత్తం లాయర్ ధనలక్ష్మి ఇంటికి వెళ్లిన అనంతరం ఆమె ఆచూకీ లభించలేదన్నారు. దీంతో జలుమూరు పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. మృతురాలు ధరించిన బంగారు ఆభరణాలను కాజేయాలనే ఉద్దేశంతో బెండి అచ్యుతరావు, కింతలి ధనలక్ష్మి, గణేష్ తదితరులు పథకం రూపొందించినట్లు పోలీసులు తమ దర్యాప్తులో గుర్తించారని తెలిపారు. పథకం ప్రకారం మృతురాలిపై దాడి చేసి హత్య చేసిన అనంతరం ఆమె వద్ద ఉన్న బంగారు, వెండి ఆభరణాలను అపహరించి, మృతదేహాన్ని గోనె సంచిలో పెట్టి హిరమండలం మండలం పింద్రువాడ సమీపంలోని బ్రిడ్జి కింద తంపర కాలువలో పడవేశారన్నారు. అనంతరం నిందితులు అపహరించిన సొత్తును పంచుకున్నారని తెలిపారు. సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ దర్యాప్తు, క్షేత్రస్థాయి సమాచారాన్ని సమన్వయం చేస్తూ పోలీసులు కేసును ఛేదించారని ఎస్పీ వెల్లడించారు. అనతి కాలంలోనే నిందితులను అరెస్టు చేసి, అపహరించిన బంగారు, వెండి ఆభరణాలను రికవరీ చేశామన్నారు. తిలారు రైల్వేస్టేషన్ వద్ద బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామని తెలిపారు. వారి వద్ద నుంచి సుమారు రూ.38 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలతో పాటు, నేరానికి ఉపయోగించిన తెల్లని కారు, బజాజ్ పల్సర్, రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. బెండి అచ్యుతరావు, కింతలి ధనలక్ష్మిలపై గతంలో ఓ కేసులో నిందితులుగా ఉన్నారన్నారు. కేసు ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

### బంగారు ఆభరణాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి

బంగారు ఆభరణాలు ధరించి బయటకు వెళ్లే సమయంలో ముఖ్యంగా మహిళలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సూచించారు. అవసరం లేకుండా అధిక మొత్తంలో బంగారు ఆభరణాలు ధరించి ఒంటరిగా వెళ్లకూడదని, శుభకార్యాలు, వేడుకలకు వెళ్లేటప్పుడు కుటుంబ సభ్యులు లేదా నమ్మకమైన వ్యక్తులతో కలిసి వెళ్లాలన్నారు. నిర్మానుష్య ప్రాంతాల్లో ఒంటరిగా ప్రయాణించకుండా, ఆభరణాలను బహిరంగంగా ప్రదర్శించకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల కదలికలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112ను సంప్రదించాలని జిల్లా ఎస్పీ సూచించారు.

# విచ్చలవిడిగా పశువుల సంచారం

- ఉదయం, రాత్రి వేళల్లో ప్రధాన రహదారులపై పశువుల గుంపులు
- వాహనదారులు, పాదచారులకు ప్రమాదకరంగా మారుతున్న పరిస్థితి
- పశువుల యజమానులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి



**నరసన్నపేట, ఆగస్టు 26 (వార్త):** నరసన్నపేట పట్టణంలో విచ్చలవిడిగా పశువుల సంచారం రోజురోజుకు పెరుగుతుండటంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఉదయం, రాత్రి వేళల్లో ప్రధాన రహదారులు, వీధుల్లో పశువులు గుంపులుగా సంచరిస్తుండటం రాకపోకలకు ఆటంకంగా మారుతోంది. పట్టణంలోని రద్దీ ప్రాంతాల్లో సైతం పశువులు రోడ్లపైనే సంచరిస్తూ ఉండటంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు అప్రమత్తంగా ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రి వేళల్లో పశువులు రహదారులపై కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని, రహదారులపై ప్రయాణించడం భయాందోళన కలిగిస్తోందని పలువురు పేర్కొన్నారు. పశువులను రహదారులపై స్వేచ్ఛగా వదిలేస్తున్న యజమానుల నిర్లక్ష్యమే సమస్యకు ప్రధాన కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు. రద్దీ సమయాల్లో పశువులు రహదారుల మధ్య నిలబడటం, అకస్మాత్తుగా ఒక వైపు నుంచి మరో వైపుకు పరుగులు తీయడం వాహనదారులకు మరింత ప్రమాదకరంగా మారుతోందన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రహదారులపై సంచరిస్తున్న పశువులను నియంత్రించాలని, వాటి యజమానులను గుర్తించి నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ప్రమాదాలు జరిగే వరకు వేచి చూడకుండా పశువుల విచ్చలవిడి సంచారానికి అడ్డుకట్ట వేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రారంభానికి నోచని రక్షిత మంచినీటి పథకం

- నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేసినా అందుబాటులోకి రాని పథకం
- తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న పట్టణంలోని పలు ప్రాంతాల ప్రజలు
- దేశవానిపేట పథకాన్ని వెంటనే ప్రారంభించాలని స్థానికుల డిమాండ్

**నరసన్నపేట, ఆగస్టు 26 (వార్త):** నరసన్నపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్య నేటికీ కొనసాగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే ఉద్దేశంతో దేశవానిపేట వద్ద రక్షిత మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేసి పనులను పూర్తి చేశారు. అయితే పనులు పూర్తయి చాలా కాలం గడుస్తున్నప్పటికీ పథకం ఇంకా ప్రారంభానికి నోచుకోకపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో పలు ప్రాంతాల ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలపై ఆధారపడాల్సి వస్తోంది. వేసవి కాలంతో పాటు ఇతర సమయాల్లోనూ నీటి కొరత సమస్య తీవ్రంగా ఉంటోందని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో దేశవానిపేట వద్ద నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.



ప్రభుత్వం ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిధులు కేటాయించి పథకం పనులను పూర్తి చేసినప్పటికీ, ప్రారంభించడంలో జాప్యం ఎందుకు జరుగుతోందో తెలియడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పథకం అందుబాటులోకి వస్తే పట్టణంలోని తాగునీటి సమస్యకు కొంతమేరైనా పరిష్కారం లభించే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సాంకేతిక, పరిపాలనా పరమైన అడ్డంకులు ఏవైనా ఉంటే వాటిని తొలగించి పథకాన్ని ప్రారంభించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. రక్షిత మంచినీటి పథకాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తే నరసన్నపేట పట్టణంలోని పలు ప్రాంతాలకు తాగునీటిని సమర్థవంతంగా సరఫరా చేసే అవకాశం ఉందని వారు తెలిపారు.

# జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపిక



**సోంపేట, ఆగస్టు 26 (వార్త):** జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీల కోసం మండల స్థాయి నుంచి క్రీడాకారులను ఎంపిక చేసేందుకు బుధవారం సోంపేటలో మండల స్థాయి స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. స్థానిక ధ్యాన్ చంద్ స్పీడ్ స్కేటింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. అండర్ 4 నుంచి అండర్ 19 క్రీడాకారుల ఎంపికలు నిర్వహించినట్లు కోచ్ గోపాలకృష్ణ తెలిపారు. ఈ పోటీల్లో స్కేటింగ్ అసోసియేషన్ శ్రీకాకుళం కార్యదర్శి బి.చంద్రావతి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బెంకిలిలో పోలీసుల పల్లెనిద్ర



# ఐక్యత...అభివృద్ధి...ఆదర్శం!

### -ఘనంగా మోటార్ యూనియన్ సామాజిక భవనం ప్రారంభోత్సవం

**సోంపేట, ఆగస్టు 26 (వార్త):** ఐకమత్యమే మహాబలము అన్న ఆనాటి పెద్దల మాటలు ఇప్పటికీ వాస్తవానికి అతి దగ్గరగా ఉన్నాయి అనడంలో ఏమాత్రం సందేహం లేదు. సోంపేట పట్టణానికి చెందిన శ్రీ విజయ దుర్గ మోటార్ యూనియన్ సభ్యులు పెద్దల మాటలను నూటికి నూరు శాతం నిరూపిస్తూ తమ ఐక్యతను, ఆదర్శాన్ని చాటుకున్నారు. జీవిత గమ్యంలో ఏదో ఒక విధంగా ప్రయాణించి కుటుంబాన్ని నిలబెట్టాలన్న ఆకాంక్షతో మోటార్ ఫీల్డ్ ను ఎంచుకున్న అనేకమంది సభ్యులు సోంపేటలో కూడా యూనియన్ గా ఉంటూ దశాబ్దాలుగా పలు కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. మెయిన్ రోడ్డు పక్కనే చిన్నపాటి షెడ్ వేసుకొని అందులోనే ఉంటూ కార్లు, ఆటోలను అద్దెలకు నడుపుతూ ఉపాధి కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో తమకంటూ ఒక సామాజిక భవనం అవసరమని చేసిన ప్రయత్నం ఈరోజు సాకారమైంది. ప్రభుత్వ ప్రోత్సాహంతో ప్రజాప్రతినిధుల సహకారంతో అనేకమంది దాతలు సహాయంతో మంచి అందమైన సామాజిక భవనాన్ని విజయదుర్గా ఆలయం ఎదురుగా నిర్మించుకొని బుధవారం స్థానిక ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు చేతులమీదుగా ప్రతిష్టింప చేసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఎంతో వైభవంగా చేపట్టి అందరి చేత శభాష్ అనిపించుకున్నారు.



### జడ్పీ చైర్ పర్సన్, ఎంపీపీ చొరవతో

గత వైసిపి ప్రభుత్వంలో మోటార్ యూనియన్ కోరిక మేరకు జడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, స్థానిక ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు, సర్పంచ్ నగిరి ప్రభావతి విజయదుర్గ ఆలయం ఎదురుగా సుమారు మూడు సెంట్లు స్థలాన్ని సామాజిక భవనం కొరకు కేటాయించారు.

### దాతల సహకారంతో..

గ్రామపంచాయతీ స్థలాన్ని అప్పగించినప్పటికీ భవనం నిర్మాణానికి అవసరమైన లక్షలాది రూపాయలు సమకూర్చుకోవడం కష్టమైన పనే అయినప్పటికీ వారి ఐక్యత, మంచితనం ఎంతో మంది దాతలను ఆకర్షించింది. కొంత మొత్తాన్ని యూనియన్ సభ్యులు చందాలు వేసుకుంటూ సమకూర్చుకోగా మిగతా కొంత మొత్తానికి పట్టణంలోని దాతలు సహకరించారు. దీంతో చక్కనైన భవనం నిర్మాణం పూర్తి చేసి బుధవారం ప్రతిష్టించుకున్నారు. ఈ జశీఅటశ్రీఅఙం రాజకీయ ప్రముఖులు, పట్టణంలోని వైద్యులు, వ్యాపారులు ఇలా అనేక రంగాలకు చెందిన పెద్దలంతా హాజరై ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజేంద్రప్రసాద్ డాక్టర్ రామకృష్ణ లతోపాటు పలువురు వైద్యులు కూటమినేతల బీన ఆనంద్, రెళ్ల నారాయణ, వైసీపీ నేత పొడుగు కామేష్, టిడిపి నేత మడ్డు రాజారావు, జగదీష్ పట్నాయక్ మోటార్ యూనియన్ నేతలు చింతల సీతయ్య పిట్ట హేమారావు బీన అశోక్ తదితరులు పాల్గొన్నారు.





## తర్లాకోటలో మొక్కలు నాటిన 'ఆ నలుగురు పలాస'



**పలాస, ఆగస్టు 26 (వార్త):** పర్యావరణ పరిరక్షణలో భాగంగా 'ఆ నలుగురు పలాస' ఆధ్వర్యంలో తర్లాకోట పంచాయతీలో మొక్కలు నాటే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 40కిపైగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ. ప్రతి ఏటా వేసవిలో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతూ మానవాళి మనుగడకు సవాల్‌గా మారుతున్న పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎల్‌నినో వంటి వాతావరణ ప్రభావాలతో వర్షపాతం తగ్గి వ్యవసాయంపైనా ప్రతికూల ప్రభావం పడుతోందని తెలిపారు. "రేపటి మన పిల్లల తరం కోసం ఈరోజే ఒక చెట్టు నాటుదాం. మన పూర్వీకులు అందించిన ప్రకృతిని మన పిల్లలకు ఆస్తిగా అందించి, భవిష్యత్ తరాల మనుగడకు బాటలు వేద్దాం" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 'ఆ నలుగురు పలాస' సభ్యులు సానా ఈశ్వరరావు, మణికంఠ, విగ్నేష్, శ్యామలరావు, హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ తెలుగుదేశం



**ఇచ్ఛాపురం, ఆగస్టు 26 (వార్త):** కొఠారి పంచాయతీ కొఠారి, పూర్ణాటకం లలో ఏ ఎం సి మాజీ చైర్మన్ సాడి సహదేవ్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగు దేశం కార్యక్రమ నిర్వహణ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ను వివరిస్తూ ఇంటింటికి తిరిగి కర పత్రికలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో పూర్వ ఎంపీపీ దక్కతఢిల్లీరావు , ఎపి రాష్ట్ర ప్రభుత్వ నాటక అకాడమీ డైరెక్టర్ దక్కత కామేశ్వరరావు, , కొయ్య సిమ్మయ్య రెడ్డి పాల్గొన్నారు. రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమం గురించి డోర్ టు డోర్ వెళ్లి కరపత్రాలు అందజేశారు. మండల తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ లోపింటి పద్మనాభం, ధర్మారావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు. 11 వ వార్డు లో జిల్లా తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి ఆశి లీలారాణి ఆధ్వర్యంలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు.

## శాంతికి చిహ్నాం సోదర భావం

**కంచిలి, ఆగస్టు 26 (వార్త):** శాంతికి చిహ్నాం సోదర భావమని ఓంశాంతి మహిళలు పేర్కొన్నారు. కంచిలి లో బుధవారం రాబోవు రక్షాబంధన్ సందర్భంగా అనేకమంది ప్రముఖులకు రక్షలు కట్టారు. ఇందులో భాగంగా మాజీ ఎంపీపీ, ప్రస్తుత జడ్పిటిసి ప్రతినిధి ఇప్పిలి కృష్ణారావు కు కూడా రక్షాబంధనం కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. సోదర భావం సమాజంలో సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తుందని, ఒకరిపై ఒకరికి గౌరవభావం పెంచుతుందని అన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# మా స్థానాలు మాకే

- స్థానిక ఎన్నికల్లో కళింగ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్
- నరసన్నపేట నియోజకవర్గంలో కళింగ ప్రముఖుల సమావేశంలో రాజకీయ తీర్మానాలు
- ఐక్యంగా డిమాండ్లు వినిపించాలని కళింగ ఐక్య వేదిక పిలుపు



**నరసన్నపేట, ఆగస్టు 15 (వార్త):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కళింగ సామాజిక వర్గానికి తగిన రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని, తమ సామాజిక వర్గం నిర్ణయించే స్థానాలను కళింగులకే కేటాయించాలని కళింగ ప్రముఖులు డిమాండ్ చేశారు. నరసన్నపేట నియోజకవర్గంలో ఇటీవల నిర్వహించిన సమావేశంలో పలువురు కళింగ సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులు ఒకే వేదికపైకి వచ్చి రాజకీయ ప్రాధాన్యత, స్థానిక ఎన్నికల్లో ప్రాతినిధ్యం తదితర అంశాలపై చర్చించారు. కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణం నాయుడు, తమ్మినేని భూషణ్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రానున్న వార్డు, పంచాయతీ, ప్రాదేశిక, మండల స్థాయి ఎన్నికల్లో కళింగ సామాజిక వర్గానికి ప్రత్యేక గుర్తింపు, తగిన ప్రాధాన్యం కల్పించాలని తీర్మానించినట్లు సమావేశంలో పాల్గొన్నవారు తెలిపారు. ప్రాంతీయ సామాజిక, రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కళింగ సామాజిక వర్గానికి కేటాయించాల్సిన స్థానాలపై ముందుగానే స్పష్టత ఇవ్వాలని వారు కోరారు. ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా ముందస్తుగానే ప్రజాస్వామ్యబద్ధంగా తమ డిమాండ్లను రాజకీయ పార్టీల అధిష్టానాలు, స్థానిక నాయకత్వాల దృష్టికి తీసుకెళ్లాలని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తమ సామాజిక వర్గం నుంచి సంపూర్ణ మద్దతు అందించే అంశంపై కూడా అధిష్టానానికి తమ అభిప్రాయాన్ని తెలియజేయాలని సమావేశంలో ఏకాభిప్రాయం వ్యక్తమైనట్లు తెలిపారు. కళింగుల రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించి సమష్టిగా నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొన్నారు. నరసన్నపేట నియోజకవర్గంలో జరిగిన ఈ తరహా సమావేశం కొత్త రాజకీయ చర్చకు దారితీసిందని, ఎన్నికలకు ముందే సామాజిక వర్గాల ప్రాధాన్యత, ప్రాతినిధ్యం వంటి అంశాలపై ప్రజాస్వామ్యబద్ధంగా చర్చించడం నిర్మాణాత్మక పరిణామమని కళింగ ఐక్య వేదిక అభిప్రాయపడింది. జిల్లాలోని ఇతర మండలాలు, నియోజకవర్గాల్లో కూడా ఆయా ప్రాంతాల్లోని కళింగ సామాజిక వర్గానికి సంబంధించిన నాయకులు, మేధావులు, విద్యార్థులు, వివిధ రంగాల ప్రముఖులు ఐక్యంగా తమ డిమాండ్లను రాజకీయ పార్టీల దృష్టికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా తమ సామాజిక వర్గానికి కల్పించాల్సిన ప్రాధాన్యతపై సమన్వయంతో పనిచేయాలని కోరారు. కళింగ సామాజిక వర్గంలో ఐక్యతను మరింత బలోపేతం చేసేందుకు రాజకీయ నాయకులు, మేధావులు, విద్యార్థులు, వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారు తమవంతు కృషి చేయాలని కళింగ ఐక్య వేదిక విజ్ఞప్తి చేసింది. ప్రజాస్వామ్యబద్ధంగా తమ డిమాండ్లను సంబంధిత పార్టీల అధిష్టానాల ముందు ఉంచడం ద్వారా సామాజిక వర్గ ఐక్యత మరింత బలపడుతుందని పేర్కొంది.



## భక్తిప్రపత్తులతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు



**ఇచ్ఛాపురం, ఆగస్టు 26 (వార్త):** ముస్లిం మతస్తుల పవిత్ర దినం మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. లాలా పేట మసీదు నుండి ముస్లిం మతస్తులు బస్టాండ్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్ధన లు నిర్వహించారు. పెద్ద ఎత్తున ముస్లిం యువత పాల్గొన్నారు.

### కిడ్నీ పోరాట సహచరుల తండ్రి మృతికి

## యూడీఎఫ్ ఘన నివాళులు



**మందస, ఆగస్టు 26(వార్త):** ఉద్దానం ప్రాంతాన్ని దశాబ్దాలుగా వేధిస్తున్న కిడ్నీ సమస్యలపై ప్రజల తరఫున నిరంతరం పోరాడుతున్న యూడీఎఫ్ ఉద్యమంలో ప్రధాన భూమిక పోషిస్తున్న బురగాపు దేవరాజు, బురగాపు సూర్యం తండ్రి ఢిల్లేశ్వరరావుఆచారి మృతి చెందడం అత్యంత విచారకరమని యూడీఎఫ్ నాయకులు అన్నారు. విషాద సమయంలో మిత్రులకు అండగా నిలిచి, తండ్రి అంత్యక్రియల్లో యూడీఎఫ్ మిత్రులతో కలిసి పాల్గొన్నడం జరిగిందని వారు తెలిపారు. ఢిల్లేశ్వరరావుఆచారి పెద్దకర్మ కార్యక్రమంలో కూడా పాల్గొని ఘనంగా నివాళులు అర్పించామన్నారు. ఉద్దానం కిడ్నీ బాధితుల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో సంవత్సరాలుగా సాగుతున్న పోరాటంలో ముందుండే కుటుంబానికి ఈ విషాదం తీరని లోటని, ఈ కష్ట సమయంలో బురగాపు దేవరాజు, బురగాపు సూర్యం కుటుంబ సభ్యులకు యూడీఎఫ్ తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూడీఎఫ్ అధ్యక్షుడు సొర్ర రామారావు, గౌరవ అధ్యక్షుడు బత్తిని లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి దున్న గాంధీ, పిచ్చుక కిరణ్, అడతాల కుమారస్వామి, బొడ్డు దాసు, లక్కోజి మిథున్, కుటుంబ సభ్యులు, మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

### 30న ఈ అడుగులు ఏ ప్రస్థానానికి..?

## పుస్తక పరిచయ సభ

-హరిపురంలోని మార్పు గ్రంథాలయంలో నిర్వహణ




**మందస, ఆగస్టు 26(వార్త):** ఈ అడుగులు ఏ ప్రస్థానానికి..? పుస్తక పరిచయ సభ ఈ నెల 30న నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మందస మండలంలోని హరిపురంలో గల మార్పు ట్రస్టు గ్రంథాలయంలో 30న ఆదివారం ఉదయం 10గంటలకు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సభాధ్యక్షునిగా యు.సోమనాథం, పౌర హక్కుల సంఘం జిల్లా బాధ్యులు, పుస్తక రచయిత పేడాడ కృష్ణారావు, డీటీఎఫ్, జిల్లా గౌరవాధ్యక్షులు, పుస్తక పరిచయం చింతాడ కృష్ణారావు(సీనియర్ జర్నలిస్ట్, అరసం, జిల్లా గౌరవ అధ్యక్షుడు), పత్రి దానేసు(పౌర హక్కుల సంఘం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు), మిస్క కృష్ణయ్య(రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కుల నిర్మూలన పోరాట సమితి), మామిడి కోదండరావు(రచయిత) తదితరులు పాల్గొంటారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక శ్రీకాకుళం జిల్లా నాయకులు కోరారు.

## భక్తులకు ముళ్లకంపల కష్టాలకు తెర

- కలెక్టర్ ఆదేశాలతో రహదారి పక్కన పొదల తొలగింపు
- శ్రీముఖలింగేశ్వర స్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు రాకపోకల్లో ఉపశమనం
- మిగిలిన మార్గాన్ని మరో మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో శుభ్రం చేస్తామన్న అధికారులు



**జలుమూరు, ఆగస్టు 15 (వార్త):** శ్రీముఖలింగేశ్వర స్వామి దర్శనానికి వెళ్లే భక్తులు, స్థానిక వాహనదారులు గత కొద్దినెలలుగా ఎదుర్కొంటున్న ముళ్లకంపల సమస్యకు పరిష్కారం లభించే దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. చల్లవానిపేట నుంచి కరకవలస, కిట్టలపాడు మీదుగా శ్రీముఖలింగం వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా చెట్లు, తుప్పలు, ముళ్లపొదలు విపరీతంగా పెరగడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపైకి విస్తరించిన ముళ్లకొంకలు ద్విచక్ర వాహనదారులు, ఆటోల్లో ప్రయాణించే వారికి ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా ఇరువైపులా విస్తరించిన పొదల కారణంగా వాహనాలు ఎదురెదురుగా వచ్చిన సమయంలో పక్కకు తప్పుకోవడం కష్టంగా మారడంతో అనేక మంది గాయాలపాలైనట్లు స్థానికులు తెలిపారు. రహదారిపై ప్రయాణం చేయాలంటేనే భయపడే పరిస్థితి నెలకొన్నట్లు పేర్కొన్నారు. ఈ సమస్యను శ్రీముఖలింగేశ్వర దేవస్థానం ప్రధాన అర్చకులు, అర్చక సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు నాయుడుగారి రాజశేఖర్ జిల్లా కలెక్టర్ నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో నేరుగా ప్రస్తావించారు. రహదారి పక్కన పెరిగిన ముళ్లపొదల వల్ల భక్తులతో పాటు స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యపై స్పందించిన కలెక్టర్ వెంటనే చర్యలు చేపట్టాలని ఆర్ అండ్ బి ఇంజనీర్లను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు రంగంలోకి దిగి చల్లవానిపేట నుంచి అచ్యుతాపురం వరకు గత రెండు రోజులుగా యుద్ధప్రాతిపదికన ముళ్లకంపలను తొలగిస్తున్నారు. మిగిలి ఉన్న అచ్యుతాపురం నుంచి శ్రీముఖలింగం, కిట్టలపాడు మార్గంలో కూడా పనులను వేగవంతం చేసి మరో మూడు రోజుల్లో రహదారిని పూర్తిస్థాయిలో శుభ్రం చేస్తామని అధికారులు తెలిపారు. దీంతో స్వామి దర్శనానికి వచ్చే భక్తులు, స్థానిక వాహనదారులు సురక్షితంగా ప్రయాణించే అవకాశం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఏఐఎం పలాస నియోజకవర్గ అధ్యక్షుడిగా కృష్ణారావు



**పలాస, ఆగస్టు 26 (వార్త):** అంబేడ్కర్స్ ఇండియా మిషన్ (ఏఐఎం) పలాస నియోజకవర్గ అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్ట్ కింజరాపు కృష్ణారావు బుధవారం ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక సమానత్వం, రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో ఏఐఎం చేస్తున్న కృషిలో భాగంగా కృష్ణారావుకు అప్పగించిన బాధ్యత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తానన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడంతోపాటు రాజ్యాంగం కల్పించిన హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లో యువత, విద్యార్థులు, వివిధ సామాజిక వర్గాలకు రాజ్యాంగ విలువలపై అవగాహన కల్పించేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. పలాస నియోజకవర్గంలో ఏఐఎంను సంస్థాగతంగా బలోపేతం చేసి మండల, గ్రామస్థాయిలో సభ్యత్వాన్ని విస్తరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ప్రజా సమస్యలను గుర్తించి ప్రజాస్వామ్య పద్ధతుల్లో స్పందించడంతోపాటు అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని కార్యక్రమాలకే పరిమితం చేయకుండా ప్రజా జీవితంలో ఆచరణలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. కొత్త బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ పలాస నియోజకవర్గంలో ఏఐఎంకు మరింత గుర్తింపు తీసుకురావడానికి, అంబేడ్కర్ ఆశయాల సాధనకు తనవంతు కృషి చేస్తానని కృష్ణారావు వెల్లడించారు.

### 28 నుంచి మందసలో

## శ్రీవాసుదేవ ద్వాదశాక్షరి మహామంత్ర జపం




**మందస, ఆగస్టు 26(వార్త):** శ్రీ త్రిదండి చిన్నశ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళశాసనములతో ఈ నెల 28న శ్రావణ పౌర్ణమి శుక్రవారం నుండి శ్రీవాసుదేవ ద్వాదశాక్షరి మహామంత్ర జపం ప్రారంభించడం జరుగుతుందని శ్రీవాసుదేవ ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఓం నమో భగవతే వాసుదేవాయ అనే ద్వాదశాక్షరి మంత్రజపం అందరి చేత జరిపించాలని సంకల్పంలో భాగంగా ఈ కార్యక్రమములో సంకల్పం చేయు భక్తులు శ్రావణ పౌర్ణమి నుండి ఐదు రోజులు ఉదయం 5గంటల నుండి 6గంటల వరకు, సాయంత్రం 5గంటల నుండి 6గంటల మధ్యలో సంకల్పం చేసుకోవడానికి రావచ్చునని తెలిపారుర. కార్తీక పౌర్ణమి తేది.25-11-2026 నుండి పంచమి వరకు ఐదు రోజులు ప్రతీ నిత్యం హోమం, తర్పణం, పుష్పార్చన, తధియారాధన జరుగుతుందన్నారు. భక్తులు 9550338780, 9390643145 అనే ఫోన్ నంబర్లకు సంప్రదించాలని వారు కోరారు.

## కొరికాన రవికుమార్‌తో జనసేన నాయకుల భేటీ

-స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రాధాన్యత

**మందస, ఆగస్టు 26(వార్త):** సుడా చైర్మన్ కొరికాన రవికుమార్‌తో జనసేన నాయకుల భేటీ అయ్యారు. పలాస నియోజకవర్గ క్షేత్రస్థాయి పరిస్థితులు, కూటమి సమన్వయం, జనసైనికుల అభిప్రాయాలపై సుదీర్ఘ చర్చ జనసేన పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల విధి విధానాల రూపకల్పన కమిటీలో సభ్యులుగా నియమితులైన సూడా చైర్మన్ కొరికాన రవికుమార్ ను నియోజకవర్గం జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలాస నియోజకవర్గంలోని క్షేత్రస్థాయి రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతానికి ఉన్న అవకాశాలు, కూటమి పార్టీల మధ్య సమన్వయం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన శ్రేణుల సన్నద్ధత తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. పార్టీ ఆవిర్భావం నుంచి జనసేన కోసం అంకితభావంతో పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలు మరియు జనసైనికుల ఆశలు, అభిప్రాయాలు, క్షేత్రస్థాయి వాస్తవాలు, రాజకీయ ఆకాంక్షలను రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. 2024లో ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పాటులో జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వం కీలక భూమిక పోషించారని, జనసేన పార్టీ బలమైన భాగస్వామిగా నిలవడం వల్లే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ప్రజా సంక్షేమం, అభివృద్ధి దిశగా రాష్ట్రం ముందుకు సాగుతోందని నాయకులు పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు జనసేన పార్టీకి అత్యంత కీలకమైనవని, పార్టీ కోసం కష్టకాలంలోనూ, ఎలాంటి పదవులు ఆశించకుండా నిరంతరం పనిచేసిన ప్రతి నాయకుడు, ప్రతీ జనసైనికుడి కృషికి తగిన గుర్తింపు, ప్రాతినిధ్యం లభించాల్సిన అవసరం ఉందని నాయకులు స్పష్టం చేశారు. పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, వారి కృషికి తగిన ప్రాధాన్యత కల్పించే విధంగా స్థానిక సంస్థల ఎన్నికల విధివిధానాలు రూపొందించాలని కోరారు. పలాస నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతం, కూటమి సమన్వయం, నాయకులు-- కార్యకర్తల మధ్య ఐక్యత, భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై కూడా చర్చించారు. కొరికాన రవికుమార్ నాయకులు వెల్లడించిన అంశాలను సానుకూలంగా స్వీకరించి, పలాస నియోజకవర్గంలోని క్షేత్రస్థాయి పరిస్థితులు, నాయకులు, జనసైనికుల అభిప్రాయాలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి, పార్టీ కోసం పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, ప్రాతినిధ్యం లభించేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జనసేన పార్టీ శ్రేణులంతా ఐక్యత, క్రమశిక్షణ, సమన్వయంతో ముందుకు సాగుతూ జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ది

కార్యక్రమంలో పలాస మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కోత పూర్ణ చంద్రరావు, జిల్లా కోఆర్డినేటర్ కంచరాన అనిల్, జిల్లా కార్యదర్శి మజ్జి భాస్కరరావు, మందస మండలం అధ్యక్షుడు కుప్పాయి గోపాలరావు, మందస పీఏసీ డైరెక్టర్ పిన్నింటి వాసు, మందస మండలం ఉపాధ్యక్షుడు పందిరి నీలయ్య, రాపాక కేశవరావు, మున్సిపాలిటీల నాయకులు శివ, సంతు, శ్రీకాంత్, బట్టి ఉదయ్, జనసైనికులు పాల్గొన్నారు.



## ఉత్తమ ఎంఈవోకి సన్మానం

**ఇచ్ఛాపురం, ఆగస్టు 26 (వార్త):** ఇచ్ఛాపురంలోని శాంతినికేతన్ హై స్కూల్ జరిగిన సమావేశం లో ఇచ్ఛాపురం మండల విద్యాశాఖ అధికారి విద్యాశాఖ అధికారి ఎస్. విశ్వనాథం కి ఉత్తమ మండల విద్యాశాఖ అధికారి గా అవార్డు వచ్చినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్, ఇచ్ఛాపురం శాఖ ఘనంగా సాలువాని కప్పి పుష్పగుచ్చం, మెమంటో తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి. కృష్ణమూర్తి రెడ్డి, పి. చిరంజీవి, జి. కృష్ణమూర్తి, జి. వెంకటరమణ, కె. రామారావు, మార్కండేయులు, తిరుపతి. మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546